ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
1
RNI No: APTEL/2023/87888
గురువారం
20 నవంబర్ 2025

బిహార్‌లో కొలువుదీరిన ఎన్డీయే సర్కార్

నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): బిహార్‌లో ఎన్డీయే సర్కార్ కొలువుదీరింది. జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ గురువారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేశారు. పట్నాలోని గాంధీ మైదానంలో నీతీశ్ తో పాటు సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హా పలువురు మంత్రులు ప్రమాణం చేశారు. వారిద్దరికి ఉప ముఖ్యమంత్రి పదవులు దక్కాయి. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్నాథ్సింగ్, జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు.

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సహా ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. బుధవారం జరిగిన ఎన్డీయే ఎమ్మెల్యేల సమావేశంలో శాసనసభాపక్ష నేతగా నీతీశ్ను ఎన్నుకున్నారు. తాను ఎన్నిక కాగానే సీనియర్ నేతలు వెంట రాగా నీతీశ్.. గవర్నర్ ఆరిఫ్ మహమ్మదాఖాన్ వద్దకు వెళ్లి, రాజీనామా సమర్పించిన సంగతి తెలిసిందే. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నీతీశ్, మోదీల జోడీ సూపర్హిట్ కొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు గానూ నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే 202 సీట్లు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా భాజపా అవతరించింది. ఆ పార్టీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. దాని స్ట్రైక్రేట్ 88శాతంగా ఉంది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా 19 మంది ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. వారిలో 10 మంది భాజపా నుంచి ఉండగా.. ఆరుగురు జేడీయూకు చెందిన నేతలు. రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం), హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఎఎం), లోక్ జనశక్తి (రాంవిలాస్)కు ఒక్కో బెర్త్ దక్కాయి. బిహార్‌లో అత్యధిక కాలం పనిచేసిన సీఎం నీతీశ్ కుమార్.. ఇప్పటివరకు దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పనిచేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు.

సీబీఐ కోర్టులో విచారణకు హాజరైన జగన్

హైదరాబాద్, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు.

ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు.

ఈ-కార్ రేసింగ్.. కేటీఆర్ ప్రాసిక్యూషన్కు గవర్నర్ అనుమతి

హైదరాబాద్, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు.

ఫార్ములా ఈ-కార్ రేసింగ్లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేయనుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

వందేళ్ల చరిత్రలో తొలిసారి.. రజనీకాంత్‌కు ఆంగ్ల పత్రిక అందించిన గౌరవం

అగ్ర కథానాయకుడు రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ ఆంగ్ల పత్రిక హిందుస్థాన్ టైమ్స్ ఫ్రంట్ పేజీలో ఆయన ఫొటోను ముద్రించారు. ఈ పత్రిక స్థాపించిన వందేళ్లలో ఇలా ఒక పేజీ మొత్తం హీరో ఫొటోను ముద్రించడం తొలిసారి కావడం విశేషం. రజనీకాంత్ ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హిందుస్థాన్ టైమ్స్ తలైవాను ఇలా గౌరవించింది. సినీ ఇండస్ట్రీని ఎంతో ప్రభావితం చేసిన వ్యక్తికి ఇలాంటి గౌరవాన్ని కల్పించడం ఆనందంగా ఉందని పత్రిక పేర్కొంది. నవంబర్ 19న పేపర్లో రజనీ ఫొటో చూసి పాఠకులు ఆశ్చర్యపోయారు. ఇది ఆయనకు ఇచ్చిన గొప్ప గౌరవం అంటూ ఆనందం వ్యక్తంచేశారు. దీనిపై రజనీకాంత్ కూడా స్పందించారు. అద్భుతమైన సర్ప్రైజ్కు కృతజ్ఞతలు తెలిపారు. తన హృదయం ఆనందంతో నిండిపోయిందన్నారు. తనపై చూపుతోన్న ప్రేమాభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. 1975లో 'అపూర్వ రాగంగళ్' తో సినీ రంగప్రవేశం చేసిన రజనీకాంత్ ఎన్నో హిట్ సినిమాల్లో నటించి తన స్టైల్తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. ఈ నెలలో గోవా వేదికగా జరగనున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి - 2025) ముగింపు వేడుకల్లో రజనీకాంత్ను సన్మానించనున్నారు.

విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడి చేస్తే కఠిన చర్యలు:సీపీ సజ్జనార్

హైదరాబాద్, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది సహా ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. దాడులకు పాల్పడినవారిపై 221, 132, 121(1) సెక్షన్ల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. వారిపై హిస్టరీ షీట్స్ కూడా తెరుస్తామన్నారు. ఒకసారి కేసు నమోదైతే భవిష్యత్ అంధకారమయ్యే ప్రమాదం ఉందని.. పాస్పోర్టు జారీ, ప్రభుత్వ ఉద్యోగానికి ఇబ్బందులు వస్తాయన్నారు. క్షణికావేశంలో ఏ చిన్నతప్పు చేసినా జీవితాంతం కుమిలిపోవాల్సి వస్తుందని సీపీ హెచ్చరించారు.

ఖమ్మంలో దారుణం.. అనుమానంతో భార్య గొంతు కోసి హతమార్చిన భర్త

ఖమ్మం, నవంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్): భార్యపై అనుమానంతో ఆమె గొంతు కోసి హత్య చేసిన సంఘటన ఖమ్మం నగరంలో కలకలం రేపింది. పోలీసులు కథనం ప్రకారం.. చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన గోగుల సాయివాణి(36), భర్త భాస్కర్కు మధ్య విభేదాలున్నాయి. దీంతో ఆమె కుమారుడు, కుమార్తెతో కలిసి ఖమ్మం నగరంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని నివసిస్తోంది. ఓ ఫంక్షన్ హాల్లో పనిచేస్తూ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలలో చదివిస్తోంది. మరోవైపు భార్యపై అనుమానం పెంచుకున్న భాస్కర్ గురువారం తెల్లవారుజామున నేరడ గ్రామం నుంచి వచ్చి ఆమె ఇంటి వద్ద కాపు కాశాడు. ఖమ్మం నగరం గట్టయ్య సెంటర్ సమీపంలోని నివాసంలో సాయివాణిపై కత్తితో దాడి చేశాడు. గొంతు కోయడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డుకోబోయిన కుమార్తె హర్షవర్ధినికి కూడా గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలిని ఖమ్మం రెండో పట్టణ సీఐ బాలకృష్ణ పరిశీలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

కోచ్‌గా నేర్పించడం నీ బాధ్యత..

ఆటగాళ్లను నిందించడమేంటి?.. గంభీర్ పై మాజీ ప్లేయర్ ఆగ్రహం

సౌతాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో టీమ్ ఇండియా ఓటమిపాలవడంతో హెడ్ కోచ్ గంభీర్ పై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. గంభీర్ ఒంటెద్దు పోకడల వల్లే టీన్ఇండియా స్వదేశంలోనూ పరాజయాలు చవిచూస్తోందని అభిమానులు, మాజీ క్రికెటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోల్కతాలో సఫారీలతో జరిగిన మ్యాచ్లో భారత్ 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ల ధాటికి 93 పరుగులే చేసింది. ఈ ఓటమికి పిచ్ కారణం కాదని, బ్యాటర్లు సరిగ్గా ఆడకపోవడం వల్లే భారత్ ఓడిందని మ్యాచ్ అనంతరం గంభీర్ అన్నాడు. ఈ వాదనను మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ తప్పుబట్టాడు. స్పిన్ను ఎలా ఎదుర్కోవాలనే విషయంలో సరిగ్గా కోచింగ్ ఇవ్వకపోవడం వల్లే భారత్ ఓడిందన్నాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టెస్టు క్రికెట్లో కొనసాగటానికి ఆడటానికి సిద్ధంగా ఉన్నప్పటికీ.. జట్టు పరివర్తన దశ అంటూ వారు రిటైర్మెంట్ తీసుకునేలా ఒత్తిడి తెచ్చారని వ్యాఖ్యానించాడు. 'భారత క్రికెట్లో పరివర్తన దశ అనేది దానికి తావు లేదు. భారత జట్టుకు పరివర్తన అవసరం లేదు. న్యూజిలాండ్, జింబాబ్వే వంటి దేశాలకు ఇది అవసరం. మా దేశవాళీ క్రికెట్లో ఎంతోమంది ప్రతిభావంతులు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ మరికొంత కాలం టెస్టు క్రికెట్ ఆడాలని భావించారు. ఈ అనవసరమైన పరివర్తన అనే చర్చతో వారిపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో వారు రిటైర్మెంట్ ప్రకటించారు. సౌతాఫ్రికాతో తొలి టెస్టులో భారత్ ఓటమికి బ్యాటర్లను బాధ్యులను చేయడం కరెక్ట్ కాదు. ఓడిపోయిన తర్వాత వారి టెక్నిక్ను తప్పుపట్టలేరు. కోచ్గా నేర్పించడం మీ బాధ్యత. బ్యాటర్లు సరిగ్గా డిఫెన్స్ ఆడలేదని అంటున్నారు. మ్యాచ్కు ముందు మీరు సరిగ్గా ట్రైనింగ్ ఇవ్వలేదు? గంభీర్ ఆటగాడిగా ఉన్నప్పుడు స్పిన్ బాగా ఆడేవాడు. కాబట్టి, అతను మరింత బాగా నేర్పించాలి' అని మనోజ్ తివారీ సూచించాడు. నవంబర్ 22 నుంచి గువాహటి వేదికగా భారత్, సౌతాఫ్రికా మధ్య రెండో టెస్టు ప్రారంభం కానుంది.

ఫ్యాషన్

ప్రతి ఒక్కరి అందంలో జుట్టు కీలకపాత్ర పోషిస్తుంది. ఇక, మగవారి లుక్‌లో హెయిర్ ప్రధానమైన బలం. పెళ్లి లేదా ఏదైనా ఫంక్షన్ కోసం మగవారు ఎన్ని రోజుల ముందు హెయిర్ కట్ చేయించుకోవాలో తెలుసా?

పెళ్లి లేదా ఏదైనా ఫంక్షన్‌కి మగవారు ఎన్ని రోజుల ముందు హెయిర్ కట్ చేయించుకోవాలో తెలుసా? హడావిడి పడితే లుక్ మొత్తం చెడిపోతుంది భయ్యా!

పెళ్లి రోజు ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత గుర్తుండిపోయే క్షణాలలో ఒకటి. ప్రతి ఒక్కరూ ఈ రోజును ప్రత్యేకంగా చేసుకోవాలని కోరుకుంటారు. వివాహ సన్నాహాలు కూడా నెలల ముందుగానే ప్రారంభమవుతాయి. ఇక, అమ్మాయి, అబ్బాయి పెళ్లిలో అందంగా కనబడటం కోసం చాలా తాపత్రాయపడుతుంటారు. పెళ్లిలో ఆకర్షణీయంగా కనిపించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ఇక, అమ్మాయిలకు అయితే స్పెషలిగా బ్యూటీ పార్లర్స్ లేదా మేకప్ కిట్స్ ఉంటాయి. కానీ, వరుడుకి ఇలాంటి సౌకర్యాలు అంతగా ఉండవు. ఇక, మగవారి లుక్‌లో జుట్టు ప్రధాన పాత్ర పోషిస్తుంది. కానీ, చాలా మంది మగవారికి హెయిర్ స్టైల్స్ గురించి అంతగా తెలియదు. దీంతో వారి లుక్ చెడిపోతుంది. పెళ్లి కోసం ఎన్ని రోజుల ముందు హెయిర్ కట్ చేయించుకోవాలో వరుడికి అంత క్లారిటీ ఉండదు. సాధారణంగా చాలా మంది అబ్బాయిలు సెలూన్‌కి వెళ్లి పెళ్లికి ఒకటి లేదా రెండు రోజుల ముందు హెయిర్ కట్ చేయించుకుంటారు. అయితే ఇది చాలా పెద్ద తప్పు. పెళ్లికి ఎన్ని రోజుల ముందు హెయిర్ కట్ చేసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఆ వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.



పెళ్లికి ఎన్ని రోజుల ముందు హెయిర్ కట్ చేయించుకోవాలి?

పెళ్లి లేదా నిశ్చితార్థం వంటి ప్రత్యేక కార్యక్రమానికి ముందు అబ్బాయిలు ఖచ్చితంగా హెయిర్ కట్ చేయించుకుంటారు. పురుషుల జుట్టు వేగంగా పెరుగుతుంది. దానిని సరైన ఆకారంలో ఉంచడం ముఖ్యం. చాలా మంది అబ్బాయిలు ఒకటి లేదా రెండు రోజుల ముందు జుట్టు కత్తిరించుకుంటారు. దీని వల్ల ముఖం మొత్తం లుక్ చెడిపోతుంది. మీరు త్వరలో వివాహం చేసుకుంటుంటే లేదా ఒక ప్రత్యేక కార్యక్రమానికి హాజరు కావాల్సి వస్తే, ఎన్ని రోజుల ముందు మీరు హెయిర్ కట్ చేయించుకోవాలో ఓ లుక్కేయండి.

పెళ్లికి 5-6 రోజుల ముందు



వరుడు తన పెళ్లి కోసం సరైన లుక్‌లో కనిపించడం చాలా ముఖ్యం. పెళ్లిలో అందరి ఫోకస్ వధూవరుల మీదే ఉంటుంది. అందుకే స్టైలిష్ లుక్‌లో కనిపించాలి. అందుకే హెయిర్ కట్ పెళ్లికి 5 నుంచి 6 రోజుల ముందుగానే చేయించుకోవాలి. హెయిర్ కట్ తర్వాత అది సరైన ఆకృతిలోకి రావడానికి కొంత సమయం పడుతుంది. కాబట్టి, ఒక వారం లేదా 6-7 రోజుల ముందుగానే హెయిర్ కట్ చేయించుకోండి.

వారం ముందు చేయించుకుంటే

మీరు ఒక వారం ముందుగానే హెయిర్ కట్ చేయించుకుంటే, అది సరైన ఆకృతిలోకి రావడానికి 4-5 రోజులు పడుతుంది. ఆ తర్వాత పెళ్లి రోజున అది పరిపూర్ణ ఆకృతిలో కనిపిస్తుంది. అలాగే, చాలా రోజుల ముందుగానే హెయిర్ కట్ చేయించుకోవడం వల్ల ఏదైనా తప్పులు ఉంటే.. ఫంక్షన్ ముందు సరిచేసుకునే సమయం ఉంటుంది. అదే ఒకటి రెండు రోజులు ముందు హెయిర్ కట్ చేయించుకుంటే అంత సమయం ఉండదు. చివరి నిమిషంలో హెయిర్ కట్ చేసుకోవడం వల్ల అనవసరమైన ఒత్తిడి పెరుగుతుంది. ముందుగానే ప్లాన్ చేసుకోవడం వల్ల మీరు రిలాక్స్ అవ్వగలరు.

ఈ విషయాలు ముఖ్యం



- జుట్టు పెరుగుదల వేగం: మీ జుట్టు ఎంత త్వరగా పెరుగుతుందో దానిపై కూడా ఆధారపడి ఉంటుంది. మీ జుట్టు వేగంగా పెరిగితే, ఈ వెంట్‌కు కొద్దిగా దగ్గరగా అంటే మూడు నుంచి ఐదు రోజుల ముందు కట్ చేసుకోవాల్సి వస్తుంది
- మీకు నమ్మకమైన బార్బర్ లేదా స్టైలిస్ట్ ఉంటే, వారితో మాట్లాడండి. జుట్టు రకం, స్టైల్, పెరుగుదల వేగం ఆధారంగా వారు మీకు సరైన సలహా ఇవ్వగలరు.
- మొదటి సారి స్టైల్ మారుస్తుంటే: మీరు పూర్తిగా కొత్త స్టైల్‌ను ప్రయత్నిస్తున్నట్లయితే, పెళ్లికి కనీసం 2-3 వారాల ముందు ఒకసారి కట్ చేయించుకుని, దానికి అలవాటు పడి.. చివరి టచ్-అప్ కోసం ఒక వారం ముందు మళ్లీ వెళ్ళడం మంచిది.

హిందూ సాంప్రదాయం ప్రకారం

- కొంతమంది హిందూ సంప్రదాయాలను పాటించేవారు మంగళవారం, శనివారం, ఆదివారం జుట్టు కత్తిరించుకోకూడదని నమ్ముతారు. కాబట్టి, ఈవెంట్ సమయం బట్టి, ఈ రోజులను మినహాయించి సోమవారం, బుధవారం లేదా శుక్రవారం వంటి రోజులలో కట్ చేయించుకోవడానికి ప్లాన్ చేసుకోవచ్చు.
- ముఖ్యమైన చిట్కా: పెళ్లికి ఒక్క రోజు ముందు లేదా కార్యక్రమం రోజున ఉదయం హెయిర్ కట్ చేయించుకోవడం మంచిది కాదు. ఏదైనా అనుకోని విధంగా జుట్టు కట్ చేయడం లేదా అలర్జీలు వంటి సమస్యలు రావచ్చు. ఆ తర్వాత పెళ్లిలో మీ లుక్ అంతా చెడిపోతుంది.

గమనిక

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.